
# మినీ కథలు:

## మాజిక్

మంత్రవాది మహేశ్వర్

ఆ రోజు ఆదివారం. వరండాలో కూర్చుని పేపరు చదువుకుంటున్నాను. చదువుతప్పితే ఎంతటి సాహసమైనా చేయటానికి సిద్ధపడే మా సిసింద్రీగాడు - అంటే మా ఆఖరబ్బాయి నా దగ్గరికి పరుగెత్తుకుంటూ వచ్చాడు.



"ఏంరా లెక్కలు చేయమన్నాను. అప్పుడే అయిపోయిందా" అనడిగాను.

"రేపు చేస్తాగానీ. యిప్పుడూ..." నసిగాడు.

"ఇంగ్లీషు చదువుతావా. పోనీ చదువుకో. ఏదైతేనేం నువ్వు చదవడం నాక్కావలసింది"

"చదవడం కాదు నాన్నా."

ఆ సమయంలో వాడిలో రాజకీయ నాయకుడయ్యే ఛాయలు కనిపించాయి నాకు.

"మరి."

"మాజిక్ చేస్తా."

గుండెఝల్లుమంది వినేసరికి. మొన్న కె. లాల్ మాజిక్ షోకి వెళ్ళిన ఎఫెక్ట్ కాదుకదా అనుకున్నాను. ఆశ్చర్యం కలిగి. "ఏం మాజిక్‌రా" అన్నాను.

"మీరే చూస్తారుగా-నే చెప్పినట్టు చేయాలి అంతే."

చదవకుండా వుండటానికి ఏదో ఎత్తేస్తున్నాడని కోపం వచ్చినా తరువాత సరే అనక తప్పింది కాదు.

"నేను కళ్ళు మూసేసుకో మనగానే మీరు మూసేసుకోవాలి. తెరవమనేదాకా తెరవద్దు. ఆ తరువాత తెరిచాక నేనేం చేశానో చెప్పాలి. చెబితే నేను ఓడిపోయినట్టు"

"ఓడిపోవడమంటే రేపటి సినిమా ప్రోగ్రాం కాన్సిల్.ఏం."

"సరే."

కళ్ళు మూసుకున్నాను.

"గాసేపయింది...."తెరవండి నాన్నా."

తెరిచి "ఏం చేశావు" అన్నాను.

"మీరే చెప్పాలి....అదే మాజిక్."

చుట్టూ చూశాను. తెలియలేదు. మళ్ళీ మూసుకోమన్నాడు. అలాగే చేశాను. లాభం లేకపోయింది. మొత్తం మూడుసార్లు చేశానుగానీ. మాజిక్ ఏమిటో అర్థంకాలేదు. మాజిక్ సంగతి తరువాత. ముందు వీడిని వదిలించుకుందామని మూడుసార్లు "మాజిక్" అంటూ అరిచినందుకు "ఇదిగో పావలా" అని జేబులో చేయి పెట్టాను....అంతే వుండాల్సిన మూడు పావలాలూ లేవు. మాజిక్ ఏమిటో తెలిసి కోపంతో సిసింద్రీగాడికేసి చూసేసరికి బెదురుతూ తనకేమీ తెలియనన్నట్లు ఎటో చూస్తున్నాడు. ★

## మేధావుల బాధ్యత!

కాకి మాంసం ముక్క నోట్లో కరుచుకొని చెట్టు కొమ్మమీద కూర్చున్నది నక్క చెట్టు కిందికెళ్ళి మోర పైకెత్తి చూసింది. "పొరపాటున కాకి నోరు తెరిస్తే ఆ మాంసం ముక్కకాస్తా కింద పడుతుంది. అప్పుడు దాన్ని మనం గుటకాయస్వాహా చేయవచ్చును!" అని నక్క అనుకున్నది.

"కాకీ బ్రదర్! నువ్వు స్వేచ్ఛా జీవివయ్యా! నీ తెలివి తేటలు అమోఘమెనవి! నీ మాట. నీ మాటల్లోని తర్కం అందర్నీ ఇట్టే



ఆకట్టి పారేస్తాయి. మార్క్సునుకూడా నువ్వు కాచివడపోశావు! ఆత్యయిక స్థితిలో మేధావి అభిప్రాయాలేమిటో తెలుసుకోవాలని చాలా కుతూహలంగా వుంది. పైగా నువ్వుకాస్త ఎత్తుమీదున్నావు! నాలుగు ముక్కలు చెప్పి నాకు మార్గాన్ని ప్రబోధించు! ఏదీ ఒక్కసారి నీ నోరు తెరువు బ్రదర్!" అని నక్క కాకి నుద్దేశించి అన్నది.

ఆత్యయికస్థితి కావడంవల్ల కాకులన్నీ తెలివిమీరిపోయాయి. ముక్కున కరుచుకుని వున్న మాంసం ముక్కను తీసి కాళ్ళకింద పెట్టుకొని కాకి "నక్కబావా! ప్రభుత్వం ఈ మాంసం ముక్క ఎందుకిచ్చిందో తెలుసా? మేధావంతులమైన మేము దీన్ని నోట్లో పెట్టుకుని నోరు మూసుకోమని! క్షమించాలి! అలా కట్టుబడిపోయాను. నాకు స్వాతంత్ర్యం అనేది లేకపోలేదు! అయితే సమయం వచ్చినప్పుడు మాట్లాడతాను. బావా!" అని అన్నది.

ఇలా అని కాళ్ళ కిందవున్న మాంసం ముక్క తీసుకొని మళ్ళీ నోట్లో పెట్టుకుంది.

—సునంద